తాగునీటి సరఫరాపై అప్రమత్తం

- కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి
- అన్ని శాఖల అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటన
- అన్ని ఏరియాలలో శాంపిల్స్ సేకరణ



రత్నాల చెరువులో పర్యటించి ప్రజల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ శారదాదేవి

మంగళగిరి: పట్టణంలో కలుషిత తాగునీటి సరఫరాతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారనే వార్తలతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం రాత్రే అనుమానిత ప్రాంతాలలలో నీటిని సేకరించి ల్యాబ్‌కు పంపారు. శనివారం తెల్లవారుజామున తాగునీటి సరఫరా సమయంలో కమిషనర్ యు శారదాదేవి పట్టణంలోని అన్ని ఏరియాలలో పర్యటించి తాగునీటి సరఫరాను పరిశీలించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత తాగునీటి కారణంగా పలువురు అనారోగ్యానికి కారణమై ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కమిటీని నియమించారు. ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ ఎస్.శ్రీనివాసులు, డీఎంహెచ్ఓ ఏ శ్రవణ్‌బాబు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు, సివిల్ సర్జన్ బయాలజిస్ట్ డాక్టర్ శోభారాణిలతో కమిటీని ఏర్పాటు చేయగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి శాంపిల్స్‌ను సేకరించారు.

ఆందోళన అవసరం లేదు..

తాగునీటి సరఫరాపై సమావేశం నిర్వహించిన అనంతరం కమిషనర్ యు.శారదాదేవి మాట్లాడుతూ సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే అధిక ప్రభావం ఉన్న రత్నాల చెరువుతో పాటు కొత్తపేట పలు ప్రాంతాలలో పర్యటించి నీటి శాంపిల్స్‌ని సేకరించి ల్యాబ్‌కు పంపడంతో పాటు ప్రజల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. శనివారం మరలా తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రస్తుతం నాణ్యమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కేఎల్ విశ్వవిద్యాలయ విద్యార్థులు

మంగళగిరి: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సాక్ డైరెక్టర్ సాయి విజయ్, సీఈఏ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు అన్నారు. కేఎల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ యాక్షన్స్ ఆక్టివిటీస్(సీఈఏ) ఆధ్వర్యంలో శనివారం కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో పాటు 9,10వ తరగతి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది సైబర్ నేరగాళ్లు కొత్త ఆలోచనలతో ప్రజలకు, విద్యార్థులకు వివిధ రకాల మెసేజ్‌ల ద్వారా మోసపూరితమైన లింకులను పంపుతున్నారని హెచ్చరించారు. అటువంటి మోసపూరిత లింకులను క్లిక్ చేయడం వల్ల పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని ఎర వేస్తారని చెప్పారు. దీంతో పాటు కంప్యూటర్లు, ల్యాప్ టాప్‌లు ఉచితంగా ఇస్తామని చెబుతూ వారు పంపే మెసేజ్‌ల వల్ల కొన్ని సందర్భాల్లో ఆధార్ కార్డుల్లో మార్పులు చేయడం ద్వారా మీ బ్యాంకు లావాదేవీల పైన ప్రభావం చూపే ప్రమాదం ఉందని వివరించారు. వివిధ రకాల బ్యాంకుల పేరుతో కూడా మోసాలు జరుగుతున్నాయని, అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీలను ఎవరికీ చెప్పకూడదని, ఓటీపీల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజల ఖాతాల్లో నుంచి పెద్ద మొత్తంలో నగదు దోచుకుంటారని, కృత్రిమ మేధ టెక్నాలజీని వాడి మీకు తెలిసిన గొంతుతో మాట్లాడించి మీ యొక్క ఖాతాలో ఉన్న నగదును దోచుకునే ప్రమాదం కూడా ఉందని చెప్పారు. ఆన్‌లైన్‌లో లోన్లు ఇస్తామని లింకులు పంపించి లింకులు నొక్కిన తరువాత అతని యొక్క డేటా మొత్తం నేరగాళ్లకు చేరి వాళ్ల ఫొటోలను మార్ఫింగ్ చేసే ప్రమాదం కూడా లేకపోలేదని వివరించారు.

క్లుప్తంగా

దుగ్గిరాలలో రక్తదాన శిబిరం

తాడేపల్లిరూరల్: భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం దుగ్గిరాల రైలుపేటలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు వనమా నరేంద్రకుమార్, చుండూరు ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెనాలి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్ పర్సన్ ముమ్మనేని భానుమతి, జిల్లా కార్యదర్శి కన్నెగంటి ప్రశాంతి, జిల్లా సేవా పక్షం ఇన్‌చార్జి ఈదర శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: మత్తు పదార్థాల వాడకం వలన జీవితాలు నాశనమవుతాయని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నషాముక్తి అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత వడ్డేశ్వరంలోని మెయిన్‌సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యంతో పాటు జీవితాన్ని కూడా చిత్తు చేసుకున్నట్లేనని అన్నారు. క్లబ్స్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.సుభాకరరాజు మాట్లాడుతూ మత్తు పదార్థం జీవితాన్ని నాశనం చేస్తుందని అన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, సమన్వయకర్తలుగా వ్యవహరించిన పి.సురేష్, జి.చంద్రశేఖర్, వి.జి.కృష్ణమూర్తి వ్యవహరించారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెరుకలపూడి, కంఠంరాజు కొండూరు అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయం శనివారం అందజేశారు. రూ.10 వేల చొప్పున వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు అందించారు. పెరుకలపూడిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచి గంపల గంగాధర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల మహేష్, అంకమయ్య, వెంకటేశ్వరరావు, గంగయ్య, నెరదల వెంకటేశ్వరరావు, మారుతి, శివ, జమ్ముల లోకేష్, కంఠంరాజు కొండూరులో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, సర్పంచి ఉన్నం ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సుభాని, కావూరి అశోక్, గుడిపూడి శేషయ్య పాల్గొన్నారు.

నిడమర్రులో స్కూల్ గేమ్స్ ప్రారంభం



మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్కూల్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ స్థాయిలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు ఎం.రవి, వి.రమేష్‌బాబు, ఎస్.రవి, డి.భాస్కరరావు, ఎన్.మంజుల, రవికిషోర్, పి.సాంబశివరావు పర్యవేక్షించారు.

ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో విస్తృత తనిఖీలు

మంగళగిరి: ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో శనివారం అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లోని వాటర్ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించి తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్పొరేషన్ ఏసీ లక్ష్మీపతిరావు నేతృత్వంలో నగరంలోని లక్ష్మీ నృసింహస్వామి కాలనీ, రత్నాలచెరువు, పార్కురోడ్డు, సీతారామకోవెల, జీఆర్ స్కూల్, ద్వారకానగర్, వీవర్స్ కాలనీ, ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంతాల్లో గుంటూరు రీజనల్ ల్యాబ్ సీనియర్ వాటర్ ఎనలిస్టులతో కలసి ప్రైవేటు వాటర్ ప్లాంట్లు తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మంగళగిరి: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆపద్బంధు సేవా సమితి ప్రెసిడెంట్ జె.ఆంజనేయులు కోరారు. నగరంలోని వీజే డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ -1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో ఆపద్బంధు సేవా సమితి సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే మరో మనిషికి ప్రాణం పోయడమేనన్నారు. మనిషి యొక్క ప్రాణాలు ఎంతో విలువైనవని, విద్యార్థులు ప్రతి మూడు నెలలకు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాదెండ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ గంజి లక్ష్మి పాల్గొన్నారు.

గణనాథులకు విశేష పూజలు



మురళికి లడ్డూ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



వేమవరంలో గణనాథుని పూజల్లో పాల్గొన్న భక్తులు

నిడమర్రు(మంగళగిరి): నగర పరిధిలోని నిడమర్రులో శనివారం వైభవంగా గణేష్ నిమజ్జన మహోత్సవం నిర్వహించారు. బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి లడ్డూ వేలంపాట నిర్వహించగా నేరెళ్ల కనస్ట్రక్షన్స్ అధినేత నేరెళ్ల మురళీ మోహన్ రూ.88,116లకు దక్కించుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బాల గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు మురళికి లడ్డూ అందజేశారు. దుర్గగుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులుగా నియమితులైన జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఫిరంగిపురం మండలంలో..

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. రసూల్‌పేటకు చెందిన వినాయకుడి విగ్రహానికి పూజలు చేసి సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వినాయక విగ్రహం ఉంచి మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనానికి అమరావతి తరలించారు. ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన గణనాథునికి విశేషపూజలు చేసి వాహనంలో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నులకపేటలో ఉన్న హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిధులు కేటాయించారు. శనివారం నుంచి అభివృద్ధి పనులు చేపట్టారు. కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.8 లక్షలు కేటాయించి హిందూ శ్మశానవాటికలో పొదలు తొలగింపుతో పాటు, మృతి చెందిన వారికి దహన సంస్కారం నిర్వహించేందుకు ప్రత్యేకంగా షెడ్డును నిర్మిస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. 15 రోజుల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

తాడికొండలో భారీ వర్షం



తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో శనివారం తాడికొండలో కురిసిన భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. అరగంట పాటు కురిసిన వర్షం మిర్చి- పత్తి రైతులకు కొంత ఊరట నిచ్చింది. లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు గత వర్షాల వరదల నుంచి ఇంకా కోలేకోపోవడంతో రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన లాం గ్రామ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. లాం గ్రామానికి చెందిన కంచెపాటి రాజ్యలక్ష్మి(72) గోరంట్ల వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు ఆమెను గుంటూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి గోలీ కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

- విద్యుత్ అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్
- 23 ఫిర్యాదులకు గానూ పద్నాలుగు పరిష్కారం



వినియోగదారునితో మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానియేల్

నగరంపాలెం: విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవల్ని అందించడంతో పాటు వారి సమస్యల్ని వెంటనే పరిష్కరించేందుకు ప్రతి అధికారి సమర్థంగా పని చేయాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. గుంటూరు టౌన్-1 డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సంగడిగుంట విద్యుత్ భవన్‌లో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు, గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అదాలత్‌తో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ మాట్లాడుతూ వినియోగదారులు ఏదైనా చిన్న సమస్యతో కార్యాలయాలకు వస్తే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. చిన్న సమస్యలకు సైతం న్యాయస్థానాల్ని ఆశ్రయించే పరిస్థితి తేవద్దని చెప్పారు. విద్యుత్ అదాలత్‌లను వినియోగదారుల సౌకర్యార్థమే నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 23 ఫిర్యాదులు రాగా అందులో పద్నాలుగును వెంటనే పరిష్కరించినట్లు చెప్పారు. మిగతా తొమ్మిది ఫిర్యాదుల్ని 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు కె.వెంకటకృష్ణ, స్వతంత్ర సభ్యుడు ఏ.సునీత, గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఆవుల మురళీకృష్ణయాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాస్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

'అమ్మ తలపులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రభాకర్, దుర్గా ప్రసాద్, మస్తానయ్య తదితరులు

పాత గుంటూరు: భారతీయ సంగీతానికి ప్రకృతి పరవశిస్తుండటం జగమెరిగిన సత్యం అని ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఓఎస్డీ డాక్టర్ ఎం. ప్రభాకర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై శనివారం ప్రముఖ డోలు విద్వాంసుడు భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'అమ్మ తలపులు' పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం భూసురపల్లి ఆదిశేషయ్య సంగీత పురస్కారాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ద్వారం దుర్గా ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎం. కోటేశ్వరరావు, డాక్టర్ సి. చంద్రమోహన్, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రాహుల సురేష్ బాబు, ప్రదీప్తి, ప్రహ్లాదుడు, మౌనిక, వేదవ్యాసుడు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా జడ్జి పి.వి.రాంబాబు



గుంటూరు రూరల్: విద్యార్థి దశ నుంచి చట్టం గురించి తెలుసుకోవాలని, అది అందరి బాధ్యతని జిల్లా జడ్జి పి.వి.రాంబాబు తెలిపారు. నగర శివారుల్లోగల లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినపుడు దాన్ని పరిష్కరించడానికి న్యాయపరమైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుల్ని ధ్వంసం చేయరాదని, ఖాళీ పత్రాలు, డాక్యుమెంట్స్‌పై సంతకాలు చేయరాదని తెలిపారు. న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని చెప్పారు. ప్రముఖ న్యాయవాది కాళిదాసు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పొన్నూరులో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

కొరిటిపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్ ట్రస్టీ, కాపు సేవా సమితి పొన్నూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పొన్నూరులోని సాయి దివ్య ఫంక్షన్ హాలులో ఆదివారం పేద విద్యార్థులకు రూ.4 లక్షల ఉపకార వేతనాల్ని పంపిణీ చేయనున్నట్లు తులసి సంస్థల అధినేత తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. కాపు సేవా సమితి పొన్నూరు శాఖ సభ్యులు శనివారం అరండల్‌పేట 3వ లైనులోని తులసి భవన్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమానికి కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్ ట్రస్టీ తులసి రామచంద్ర ప్రభు రూ.2 లక్షలు, కాపు సేవా సమితి పొన్నూరు శాఖ రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.4 లక్షల్ని 120 మంది విద్యార్థులకు అందజేయనున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన ఉండాలి

ఎంపీపీ షేక్ షహేలానర్గీస్

ఫిరంగిపురం: ఫోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. కమిటీకి చైర్మన్‌గా తహసీల్దార్ పద్మనాభుడు, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ మెంబర్‌గా, ఎంపీడీఓ అనూరాధ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. సమావేశంలో షహేలానర్గీస్ మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం బలవర్ధకమైన ఆహారం అని వాటిని ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రత కోసం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం , గర్భిణులకు పరిశుద్ధమైన బలమైన ఆహారం కోసం వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ డి.అనూరాధ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఎంపీటీసీ సభ్యురాలు సుధారాణి, కె.రామారావు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనూరాధ

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నగదు రహిత లావాదేవీలపై పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ మూడువేల జనాభా దాటిన ప్రతి గ్రామంలో నగదు రహిత లావాదేవిలు నిర్వహించాలని దీనిపై ప్రభుత్వం సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల శిక్షణ పొందినవారిచే ఒకరోజు శిక్షణ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు ఇస్తున్నామని చెప్పారు. ఇంటిపన్నులు కట్టిందేకు నగదు ఇవ్వకుండా మొబైల్ ఫోన్లు ద్వారా, మిషన్లు ద్వారా నిర్దేశించిన క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి నగదు రహిత లావాదేవిద్వారా పన్నులు చెల్లించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు సెయింట్‌ఆన్స్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సిస్టర్ థెరసమ్మ

ఫిరంగిపురం: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు డి.జననీ, ఆర్.గౌతమి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సిస్టర్ ఒట్టి థెరసమ్మ తెలిపారు. పాఠశాలలో శనివారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 22న నారాకోడూరులో నిర్వహించిన హ్యాండ్‌బాల్ ఎంపికల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. ఈనెల 29 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు తెనాలిలోని ఏఎస్ఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మలమేరి, శిల్పలను అభినందించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ రెహ్మాన్ తదితరులు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథకం ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రెహ్మాన్ శనివారం తెలిపారు. జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంప్, ర్యాలీ, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, యూత్ సర్వే, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపుల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రశంసా పత్రాలను అందజేయగా వాటిని విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ శిక్షణాధికారి రేఖా నరేష్‌బాబు పాల్గొనగా సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన కోట నిహారిక, ఎం వికాస్‌లకు కళాశాల సెక్రటరీ సిస్టర్ జి నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ రెహ్మాన్ ఉత్తమ విద్యార్థుల సమన్వయ కర్తల అవార్డులను అందజేశారు.

బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు

చేబ్రోలు: బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు తప్పవని గుంటూరు పోస్కో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ సమస్యలు – సవాళ్లు అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శనివారం జరిగింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల మాట్లాడుతూ బాలల హక్కులైన విద్యాహక్కు చట్టం, జీవించే హక్కుల గురించి తెలిపారు. పోలీసులు బాలలకు కల్పించే రక్షణ, మంచి స్పర్శ, చెడు స్పర్శ, పోక్సో చట్టం, చట్టంతో విభేదించిన బాలురకు ప్రత్యేక బాలల కోర్టులు, రక్షణ కేంద్రం గురించి వివరించారు. గుంటూరులోని జువెనైల్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ వాసంతి మాట్లాడుతూ లైంగిక వేధింపులు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా వంటి వివిధ మార్గాల్లో పిల్లలు సులభంగా దోపిడీకి గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

మేలైన విస్తరణ సేవలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వరు

గుంటూరు రూరల్: రైతులకు మేలైన విస్తరణ సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలోని కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలోని ఎంపిక చేసిన 40 మంది ఎరువులు, పురుగు మందులు డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవల డిప్లొమా కోర్సు శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు డీలర్లు మేలైన ఎరువులు, పురుగు మందులు అందిస్తూ వారి అభివృద్ధికి సహకరించాలన్నారు. పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి మాట్లాడుతూ రైతులకు అవరాన్ని బట్టి డీలర్లు సరైన నాణ్యమైన వ్యవసాయ వనరులు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందజేయాలని సూచించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ ఈ కోర్సు సంవత్సరంపాటు ఉంటుందని, ప్రతి ఆదివారం క్లాసులు నిర్వహిస్తారన్నారు. శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు డీలర్లకు అవసరమైన శిక్షణ అందిస్తారన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త టి. వెంకటేశ్వర్లు, కె. వేణుకృష్ణ పాల్గొన్నారు.